ప్రజాశక్తి



శనివారం 4 నవంబర్ 2023 | 5 | విజయనగరం

రైతులకు అండగా ఉంటాం

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహాయ సహకారాలతో వైభవంగా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మ వారి జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఎస్.కోట నియోజకవర్గంలో జరగబోయే సామాజిక బస్సుయాత్రను జయప్రదంచేయాలన్నారు. వాతావరణంలో మార్పులు, ఊహించినంత వర్షపాతం లేని కారణంగా రైతాంగం వ్యవసాయ సాగులో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, పంటల బీమా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ఎన్నో సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నా పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల జిల్లా అత్యంత వెనుకబడిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, వై.వెంకటేశ్వరరావు అన్నారు. మరోవైపు రాష్ట్రానికి మోసం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నిస్తానంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా బిజెపి వద్ద నోరు మెదపడం లేదన్నారు. ఈనేపథ్యంలో జనసేన కార్యకర్తలు లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారక్షణ భేరి ముగింపు సందర్భంగా ఈనెల 15న విజయవాడలో జరగబోయే బహిరంగ సభకు ప్రజలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే జిల్లా వెనుకబాటు

- బిజెపికి వైసిపి, టిడిపి ఊడిగం
- జనసేన కార్యకర్తలు ఆలోచించాలి
- 15న విజయవాడ సభకు తరలిరావాలి
- ప్రజారక్షణ భేరిలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్, జామి, శృంగవరపుకోట, కొత్తవలస

మందసలో ఈనెల 2న ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర శుక్రవారం విజయనగరం జిల్లాలో సాగింది. పూసపాటిరేగ, విజయనగరం, జామి, కొత్తవలస, ఎస్.కోట మీదుగా విశాఖ జిల్లాలో ప్రవేశించింది. విజయనగరంలో కోట వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో లోకనాథం, వెంకటేశ్వరరావు మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతో, జిల్లాలోని తోటపల్లి లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేక పోతోందన్నారు. తారకరామతీర్థసాగర్ అసంపూర్తిగా ఉండడం వల్ల నెల్లిమర్ల నియోజకవర్గవాసులు 18ఏళ్లగా ఎదురు చూస్తున్నా సాగునీరు అందలేదని, విజయనగరం పట్టణానికి తాగునీరు కూడా వచ్చే పరిస్థితి లేదని వివరించారు. సుజల స్రవంతి ప్రాజెక్ట్ నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని చెప్పిన మాటలు నీటిమూటలుగానే మిగిలాయన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని సహకార రంగంలోకి తీసుకొస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీ నెరవేరలేదు సరికదా ఆధునీకరణ పేరుతో ఫ్యాక్టరీని మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బిలిలోని ఎన్‌సిఎస్ సుగర్స్ యాజమాన్యం నుంచి బకాయిలు ఇప్పించాలని రైతులు ఆందోళన చేస్తే, ఆ పేరుతో ఫ్యాక్టరీ భూములను విక్రయించి, అసలుకే ఎసరు పెట్టారన్నారు. దీంతో, వందల కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలి తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ సంస్కరణవల్ల విద్యుత్ భారాల మోయలేని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఆర్థికంగా కుదేలై చాలా వరకు మూత పడ్డాయని, మరికొన్ని ఆ దిశగానే ఉన్నాయని అన్నారు. ఫలితంగా వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

వై.వెంకటేశ్వరరావు



ప్రభావతి



ఎవి నాగేశ్వరరావు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా రంగంలో స్కూళ్లను మెర్జిచేసి, ఉపాధ్యాయ పోస్టులను కుదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్ల నుంచి కార్మికుల నిజ వేతనాలు పడి పోయాయన్నారు. 13ఏళ్లుగా కనీస వేతనాలలో సవరణ లేదన్నారు. బానిసలుగా పని చేయించుకొని చాలీచాలని వేతనాలతో బతకాల్సి వస్తుందన్నారు. అన్ని రంగాల్లో పని చేస్తున్న వారికి, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ జోడీలు ప్రజలను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ అడిగింది తొలుత కమ్యూనిస్టులేని, ఇటీవల పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన బిజెపి 2024 ఎన్నికల్లో అమలు చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తోందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు మూతపడిన, ప్రభుత్వ పరిశ్రమలు అమ్మేస్తున్నా మంత్రి బొత్సకు పట్టడం లేదన్నారు. మన సమస్యల పరిష్కారం కోసం మనమే పోరాడాలని, ఇటువంటి పోరాటాలు నిర్వహించే సిపిఎం అండగా ప్రజలు నిలబడాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు బస్సు యాత్ర తో వచ్చిన ప్రజా నాట్యమండలి కళారూపాలు, విప్లవ గేయాలు, ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిర్వహించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు, బి.ప్రభావతి, కె.ధనలక్ష్మి, హరిబాబు, జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, వి.లక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరికి ఘన స్వాగతం

జిల్లాలో ప్రవేశించిన ప్రజా రక్షణ భేరి బస్సుయాత్ర నాయకులకు పూసపాటిరేగలో సిపిఎం అభిమానులు, కార్యకర్తలు, స్కీమ్‌వర్కర్లు, విద్యార్థులు, రైతులు, పైడిభీమవరం ప్రాంతానికి చెందిన కార్మికులు ఘన స్వాగతం పలికారు. మహిళలు నాయకులకు నుదుటన తిలకం దిద్ది హారతిపట్టారు. అనంతరం నగరానికి చేరుకున్న బృందానికి గుమ్చి సెంటర్‌లో సిపిఎం కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు కోలాటంతో స్వాతం పలికారు. అక్కడి నుంచి కోట వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. యువతీ, యువకులు కోలాటంతో అలరించారు. సభ అనంతరం పాత ఎయు క్యాంపస్ భవనంలో నిర్వహిస్తున్న గిరిజన వర్శిటీని నాయకులు సందర్శించారు. తరువాత భీమసింగి, జామి మీదుగా ఎస్‌కోట, అక్కడి నుంచి కొత్తవలస వరకు ప్రజారక్షణభేరి యాత్ర సాగింది. ఈ సందర్భంగా అన్నిచోట్లా వివిధ తరగతులకు చెందిన ప్రజానీకం నాయకులకు వినతిపత్రాలు అందజేశారు.

సిపిఎం బృందానికి వినతులు

సిపిఎం బృందానికి సమస్యల పరిష్కారం కోసం పలువురు వినతులు ఇచ్చారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, విఆర్‌ఎలు, డివైఎఫ్ ఐ, ఎస్‌ఎఫ్ ఐ, ఎపి బేవరేజెస్ సంఘం నాయకులు, ఆర్‌టిసి అద్దె బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఎల్‌బిజి నగర్, గురజాడ నగర్, రామకష్ణ నగర్, బాబామెట్ట, సుందరయ్య కాలనీ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

నాయకులకు వినతి అందిస్తున్న ఆశావర్కర్లు

ఎర్రజెండా బలపడటంతోనే ప్రజలకు మేలు

సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు కొత్తవలస మండల కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి 9 ఏళ్లలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని అమలు చేయని బిజెపికి వ్యతిరేకంగా వైసిపి, టిడిపిలు నిలబడాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసి, కార్మిక హక్కులను కాలరాసి, కుల,మత విద్వేషాలను రెచ్చగొట్టే బిజెపికి వ్యతిరేకంగా, రాష్ట్రంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాడుతున్న సిపిఎం వెంట ప్రజలు నడవాలని పిలుపు నిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభావతి మాట్లాడుతూ మహిళల కు సమన హక్కుల కోసం, అసమానతలు రూపు మాపేందుకు సిపిఎం చేసే పోరాటంలో మహిళలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సిపిఎంగా స్థానిక సమస్యలపైన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు పాల్గొన్నారు.

'భీమసింగి' మూతతో చెరకు రైతులకు అన్యాయం

జామి మండల కేంద్రానికి చేరుకున్న ప్రజారక్షణ భేరికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, చెరుకు రైతులు స్వాగతం పలికారు. భీమసింగి సహకార చక్కెర కర్మాగారం మూసివేతతో ఈ ప్రాంత చెరుకు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, తక్షణమే ఫ్యాక్టరీ తెరిపించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయకులకు రైతులు వినతులు అందజేశారు. అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు సైతం తమ సమస్యలపై వినతులు అందజేశారు.

అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యావసర ధరలు తగ్గించి ప్రజానీకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ రూ.400, పెట్రోల్, డీజిల్ లీటరు రూ.60కే అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కోసం తప్ప పేదల కోసం పని చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బుద్దరాజు రాంబాబు మాట్లాడుతూ, జామి లో అగ్రహారం భూ సమస్యను పరిష్కరించి, సాగులో ఉన్న రైతులకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెడుతున్నారు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆస్తులను కార్పోరేట్లకు దోచి పెడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.హరిబాబు అన్నారు. ఎస్.కోట చేరుకున్న బస్సుయాత్ర బృందానికి విద్యార్థులు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎం హరిబాబు మాట్లాడుతూ. కేంద్రంలో మోడీ ప్రజల ఆస్తులైన ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గాని, చంద్రబాబు నాయుడు గాని, పవన్ కళ్యాణ్ గాని నోరు మెదపటం లేదని అన్నారు. సిపిఎం నాయకులకు పోలవరం కాలువలో భూమిపోయిన రైతులు, బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులు, ఏళ్ల తరబడి దేవాదాయ భూములను సాగు చేస్తున్న రైతులు గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ అంబాసిడర్లు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలని వినతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు బుద్ధరాజు రాంబాబు, చల్ల జగన్, మద్దిల రమణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో వినతులు స్వీకరిస్తున్న నాయకులు

వినతుల తక్షణ పరిష్కారానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి-వంగర

ప్రజల నుంచి వచ్చిన వినతులను తక్షణమే స్పందించి పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 64 వినతులు స్వీకరించారు. తోటపల్లి ఆయకట్టుకు శివారున ఉన్న వంగర మండలంలోని భూములకు సాగునీరు తక్షణమే అందించి ఆదుకోవాలని మద్దివలస, ఎం.సీతారాంపురం గ్రామాల రైతులు ఐదు వినతులు అందించారు. నూతన గృహాలు మంజూరు చేయాలని 16 వినతులు వచ్చాయి. ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని 21 వినతులందాయి. మండలంలోని బంగారువలస - విశాఖపట్నం నైట్‌హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని, వంగర మండలంలోని వివిధ గ్రామాలను కలుపుతూ రాజాంకు బస్సు సౌకర్యం కల్పించాలని రెండు వినతులు అందించారు. అమ్మఒడి పథకం నిధులు మంజూరు కావడం లేదని మూడు వినతులు వచ్చాయి. సిసి రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని రెండు అర్జీలందాయి. అరసాడ పాఠశాలలో నాడు-నేడు పనులు చేసినప్పటికీ బిల్లులు అందలేదని విన్నవించారు. పశుసంవర్ధక శాఖకు ఒకటి, ఐసిడిఎస్‌కు రెండు వినతులు వచ్చాయి. అనంతరం జాయింట్ కలెక్టర్ అశోక్.. తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రీసర్వేకి సంబంధించి డిటితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల అధ్యక్షులు కరణం సుదర్శన రావు జెసిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, పశుసంవర్ధక శాఖ జెడి విశ్వేశ్వరరావు, వంగర మండల ప్రత్యేక అధికారి నూకరాజు, డ్వామా ఎపిడి ఎం.శ్రీనివాసరావు, ఎంపిడిఒ శశిభూషణరావు, డిటి బి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని జెసికి వినతి పత్రం అందిస్తున్న రైతులు

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన పలు ప్రాంతాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంమీక్షించారు. రాజాం మార్కెట్‌యార్డులో పత్తి జన్నింగ్‌మిల్లును కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నవంబర్ 3 నుంచి సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుయికోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాకు కనీస ధర రూ.7020కు అమ్ముకోవచ్చునన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన జన్నింగ్ మిల్లులు, మార్కెట్ యార్డుల వద్దకు ఎవరైనా దళారులు, మద్యవర్తులు వస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి , జిల్లా వ్యవసాయాధికారి, ఎఎంసి కార్యదర్శి, రాజాం జన్నింగ్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న నాఊరు విజయనగరం సంస్థ ప్రతినిధులు

జగన్నాథ రథ నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని దాసన్నపేట ప్రాంతంలో ప్రసిద్ధ దేవాలయం జగన్నాథ స్వామి రథ నిర్మాణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆలయంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి మూల విరాట్టులను దర్శించుకున్నారు. అనంతరం రథ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జగన్నాథ స్వామి రథయాత్రలో ప్రధానమైన రథాన్ని నిర్మించేందుకు దాతలు ముందుకు వచ్చారు. నా ఊరు విజయనగరం అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.5 లక్షలు సేకరించిన నిధుల చెక్కును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి అందజేశారు. ఆ చెక్కును దేవస్థానం అనువంశిక ధర్మకర్తలకు ఆయన అందజేశారు. అనంతరం రథనిర్మాణం పూర్తయ్యే విధంగా చూస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్‌పితో ఎన్నికల సిఇఒ వీడియో కాన్ఫరెన్సు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, చెక్ పోస్టుల ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై వివరాలను, రాబోయే ఎన్నికలకు సంబంధించి సమగ్ర వివరాలు, ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, డిఆర్ఒ అనిత, తదితరులు పాల్గొన్నారు.

9న బిసి కులగణనపై ర్యాలీ

పిసిసి అధ్యక్షులు రాక

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 9న విజయనగరంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన చేపట్టిన బిసి కుల జన గణన ర్యాలీని జయప్రదం చేయాలని డిసిసి అధ్యక్షులు రమేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి హాజరవుతారని తెలిపారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ బిసి కుల జన గణన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. మహిళా రిజర్వేషన్ లో బిసిలకు ఉప కోట కల్పించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యుసి సభ్యులు కొప్పుల రాజు, ఎన్.రఘు వీరారెడ్డి , పిసిసి ప్రధాన కార్యదర్శి డి . శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర ఇన్చార్జి రాకేష్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో నగర అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, నాయకులు ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై దాడికి పాల్పడిన మరో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా సర్వజన ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సువర్ణ కుమార్ పై దాడికి పాల్పడిన మరో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. సర్వజన ఆసుపత్రిలో డాక్టర్ సువర్ణ కుమార్ వద్దకు చికిత్స నిమిత్తం లక్ష్మణ్ అనే వ్యక్తి, అతని స్నేహితులు వచ్చి, సర్జరీ చేస్తున్న వైద్యుడితో వాదనకు దిగి, దాడికి పాల్పడడంతో వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో ఇప్పటికే ఒకరిని అరెస్టు చేయగా, మరో నిందితుడు విశాఖపట్నం రవీంద్ర నగర్‌కు చెందిన ఎదువాక హరి కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సిటియును సందర్శించిన ప్రథమ ఛాన్సలర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాట్లాడుతున్న విశ్రాంత్ ఐఎఎస్ మదన్‌లాల్

ఇటీవల మొట్టమొదటి ఛాన్సలర్ గా నియమితులైన విశ్రాంత ఐఎఎస్ మదన్ లాల్ మీనా శుక్రవారం స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శిం చారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రస్తుత వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతించారు. తొలుత యూనివర్సిటీ ఆవరణ లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని అనంతరం వివిధ విభాగాలు, ప్రయోగశాలలు సందర్శించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ విశ్వవిద్యాలయ గురించి ఛాన్సలర్ కు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం బోధనా సిబ్బందితో మాట్లాడి భోదన, పరిశోధన, పరిపాలనా పరమైన వివిధ అంశాలను అడిగి తెలుకున్నారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యాప్రగతి, విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ శరత్ చంద్ర బాబు, జితేంద్ర మొంహన మిశ్ర, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కివాడే, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

సరస్‌కు అపూర్వ స్పందన

- 8 వరకు డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు
- డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి

ప్రజాశక్తి-విజయనగరం కోట

అఖిలభారత డ్వాక్రా బజార్ (సరస్)కు విజయనగరంలో అపూర్వ స్పందన వచ్చిందని డిఆర్‌డిఎ, వైకెపి ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కల్యాణ చక్రవర్తి తెలిపారు.. గత నెల 28న ఈ సరస్‌ను ప్రారంభించగా, ఇప్పటివరకు సుమారు రూ.2.8 కోట్ల విలువైన విక్రయాలు జరిగాయని తెలిపారు. సరస్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో తొలిసారిగా ప్రభుత్వం ఈ సరస్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇక్కడ మొత్తం 194 స్టాల్సు ఏర్పాటు అయ్యాయని, 15 రాష్ట్రాలకు చెందిన సుమారు 45 స్టాల్సు బయటి రాష్ట్రాల నుంచి రాగా, మిగిలిన స్టాల్స్‌లో అధికశాతం మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుంచి వచ్చాయని తెలిపారు. మన జిల్లాకు చెందిన స్టాల్స్‌ను కూడా ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రసిద్ధ ఉత్పత్తులు, వస్త్రాలు, తినుబండారాలు, హస్త కళలు, అలంకార వస్తువులను అక్కడి మహిళా సంఘాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాయని తెలిపారు. సరస్‌లో కేవలం వస్తు ప్రదర్శన, విక్రయాలకే పరమితం కాకుండా, సాయంత్రం 6 నుంచి 9 వరకు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

గ్రామీణ నైపుణ్యానికి, హస్త కళలకు పెద్ద పీట వేస్తూ, వారి ఉత్పత్తులను ప్రోత్సహించడం, వాటికి ప్రాచుర్యం కల్పించడం ముఖ్య ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ సరస్‌లను దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. సరస్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వంతోపాటు, స్త్రీనిధి, మెప్మా, ఎస్‌బిఐ డిసిసిబి, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఆప్కాబ్ తదితర సంస్థలు సహకరిస్తున్నట్లు తెలిపారు.

ప్రదర్శనలో వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, జ్యువెలరీ, హ్యాండ్‌లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్, బెడ్‌షీట్స్, గృహలంకరణ వస్తువులు, హ్యాండ్‌లూమ్స్, కుర్తాలు, రెడీమేడ్ దుస్తులు, ఆభరణ వస్తువులు, పచ్చళ్లు, మసాలా దినులు, ఆయుర్వేద ఉత్పత్తులు, తినుబండారాలు, జ్యూట్ ఉత్పత్తులు, నాబార్డ్, మెప్మా, తెలంగాణా రాష్ట్ర ఉత్పత్తులు పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల8వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, అప్పటి ఆదరణ బట్టి కొనసాగింపుపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రసిద్ధ ఉత్పత్తులన్నీ ఒకే చోట దొరకడం అపూర్వ అవకాశమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, సరస్‌ను సందర్శించాలని పీడీ కల్యాణ చక్రవర్తి కోరారు. సమావేశంలో డిఆర్‌డిఎ ఎపిడి సావిత్రి, డిపిఆర్ఒ డి.రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ చక్రవర్తి

తడి, పొడి చెత్తను సేకరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వంద శాతం సేకరించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు అన్నారు. పట్టణంలో పారిశుధ్య పనులను, పాత, నూతన చెత్తశుద్ధి పార్కులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం పారిశుధ్య పనులు, ఆస్తిపన్ను, నీటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు వేర్వేరుగా అందించాలని ప్రజలను కోరారు. విశాఖ రీజియన్‌లో శ్రీకాకుళం, బొబ్బిలి, సాలూరు మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ బాగుందన్నారు. ఆస్తిపన్ను, నీటిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన తాగునీటి ప్రాజెక్టులు మంజూరు అయ్యాయని, ఆయా పనులు పూర్తి అయితే 24 గంటలూ తాగునీరు సరఫరా చేయవచ్చునని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లపై కమిషనర్ శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు.

బంగార్రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా బంగార్రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-భోగాపురం

టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. విజయవాడలో ఉన్న బంగార్రాజు పార్టీ నాయకుల మధ్య అక్కడ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, పిల్ల సూరిబాబు, పిడుగు తోటరావు, కోరాడ తాతారావు, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత మున్సిపల్ అధికారులదే

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలోని మల్లమ్మపేటలో కబ్జాకు గురైన స్థలంలో ఆక్రమణలు తొలగించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు చెప్పారు. మల్లమ్మపేటలోని సర్వే నెంబర్ 155-12, 14లో గ్రామకంఠం స్థలం ఆక్రమణకు గురైందన్నారు. ఆక్రమణలు తొలగించి గ్రామకంఠం భూమిని కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శని, ఆదివారాల్లో నిర్వహించే ఓటర్ల ప్రత్యేక నమోదు శిబిరాన్ని వినియోగించుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పి.కీర్తన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు, బిఎల్‌ఒలు సూర్యకుమారి, అడవి నాయుడు, మోనిక పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని డబ్బిరాజుపేటలో ప్రాథమిక పాఠశాల, వేపాడలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, విక్టరీ పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఎడ్యుకేషనల్ అసెస్మెంట్ సర్వేను పరిశీలించారు. పరిశీలనలో వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్-ఎస్ శ్రీవల్లి, సిఆర్‌పి కాటపల్లి రాంప్రసాద్, వై.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

5న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘం అత్యవసర రక్తదానానికి పిలుపునిచ్చింది. శుక్రవారం సాధన యువజన సంఘం ప్రతినిధి పోలుబోతు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన రైలుప్రమాద బాధితులకు శస్త్రచికిత్సల నిమిత్తం ఈ నెల 5న జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో అత్యవసర శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. రక్తదాతలు 8897971002, 9573134238 నంబర్లను సంప్రదించాలని కోరారు.

15న చలో విజయవాడ

ప్రజాశక్తి-రేగిడి

ఈ నెల 15న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు పి.విశ్వనాథం, వి.తిరుపతిరావు, ఎం.త్రినాథ కోరారు. సిపిఎం ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలని శుక్రవారం మండలంలోని కాగితాపల్లిలో కరపత్రాలు పంపిణీ చేశారు.

గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

ఆతవను సందర్శించిన అధికారులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఆతవ గ్రామంలో దళిత కాలనీని శుక్రవారం తహశీల్దార్ కె.ప్రసన్నకుమార్ సందర్శించారు. మురుగునీరు పోకుండా నిల్వ ఉండటంతో రోగాల బారిన పడుతున్నామని ఇటీవల దళితులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాల మేరకు ఆ కాలనీని తహశీల్దార్ పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి నానిబాబు, విఆర్‌ఒ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. న్యూఢిల్లీకి చెందిన ఐఎన్‌టిఎస్‌ఒ సంస్థ నిర్వహించిన నాలెడ్జ్ అసెస్మెంట్ క్యాట్ లెవెల్-1 పరీక్షలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు మ్యాట్‌లో 71 మంది, ఫ్యాట్‌లో 67 మంది, చాట్‌లో 58 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించారు. లెవెల్-2 పరీక్షలో ప్రతిభ కనబరిస్తే స్కాలర్‌షిప్‌కు అర్హత సాధిస్తారని ప్రిన్సిపల్ కె.మురళీధర్, వైస్ ప్రిన్సిపల్ జి.చంద్రశేఖర్, డీన్ దుర్గాప్రసాద్ చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో మోపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఇసిజిసి పరిశ్రమ బెంచీలను వితరణ చేసింది. వీటిని శుక్రవారం ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైసిపి ఐటి విభాగం జోనల్ ఇన్‌ఛార్జి బడ్డుకొండ మణిదీప్ నాయుడు పాఠశాలకు అందజేసి, ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బడ్డుకొండ రమేష్, వైస్ సర్పంచ్ బంటుపల్లి సత్యం నాయుడు, ఎంఇఒ రాధాకృష్ణ, హెచ్‌ఎం నాగ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లిలో జాతీయ రహదారి పక్కన ఉన్న జెఎస్‌ఎన్ కాలనీలో శుక్రవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రాళ్లపూడి లక్ష్మికి చెందిన పూరిల్లు కాలిపోయింది. ఈ ఘటనలో వంట సామాన్లు, దుస్తులతోపాటు రైస్ కార్డ్, ఆధార్ కార్డ్ పూర్తిగా కాలి బూడిదయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గజపతినగరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి, మంటలను అదుపులోకి తెచ్చింది.

భవనం నుంచి జారిపడి కార్మికుడు మృతి

న్యాయం చేయాలని సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి జారిపడి మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. నాయకుల వివరాల ప్రకారం... మంగళ్‌దాస్ నగర్‌లోని ఓమేగా హాస్పిటల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో, నాలుగో అంతస్తులో శుక్రవారం మధ్యాహ్నం సమయంలో తాపీ మేస్త్రీ బూర్లి శ్రీనివాసరావు (36) సెంట్రింగ్‌కు తూకం వేస్తూ జారి కిందపడి చనిపోయాడు. సదరు కార్మికుడి సొంత జిల్లా విజయనగరం. జీవనోపాధి కోసం గుంటూరు వచ్చి తాపీ పనిచేసుకుంటున్నాడు. కార్మికుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటన సమాచారం తెలుసుకున్న యూనియన్ నాయకులు కార్మికుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని అపార్ట్‌మెంట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే కార్మికుడు చనిపోయారని అన్నారు. నిర్మాణ సమయంలో కార్మికులకు రక్షణ సౌకర్యాలు ఏర్పాటు చేయలేదన్నారు. లాభాలే ధ్యేయంగా భావిస్తూ సౌకర్యాలు కల్పించకపోవటం వల్ల కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ చర్యలు పాటించే విధంగా పర్యవేక్షణ చేయటంలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరించటం వల్ల ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని విమర్శించారు. మరోవైపు వైయస్సార్ బీమా పేరుతో ప్రచారం చేస్తున్నారే తప్ప చనిపోయిన కార్మికుడికి పరిహారం అందించట్లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చనిపోయిన కుటుంబానికి పరిహారం ఇవ్వాలని, కార్మికుడి పిల్లల చదువుకు అయ్యే ఖర్చులను భరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును సక్రమంగా పనిచేయించి, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సిఐటియు నగర కార్యదర్శి శ్రీనివాస్, నగర భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాలరావు, జీవన్, శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పాల్గొన్నారు.

మృతి చెందిన శ్రీనివాసరావు

విద్యా ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు

- కెజిబివిని తనిఖీ చేసిన డిఇఒ లింగేశ్వరరెడ్డి
- ఎస్‌ఒ పనితీరుపై పలువురు మహిళల ఫిర్యాదు

కెజిబివిలో భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-వంగర

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి అన్నారు. వంగరలోని కెజిబివిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. కెజిబివిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరతను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస విద్యాసామర్థ్యాలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ -2023 పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు వంగర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఎంఆర్‌సికి చేరుకున్న డిఇఒను పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి, కెజిబివి స్పెషల్ ఆఫీసర్ బి.రోహిణి పనితీరు సక్రమంగా లేదని, విద్యాలయానికి వచ్చిన వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధి నిర్వహణలో బాధ్యత లోపిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఒను హెచ్చరించారు వారంలో రెండు రోజులు కెజిబివిని సందర్శించాలని ఎంఇఒ దుర్గారావును ఆదేశించారు అనంతరం అరసాడలో నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిఒ వంగపండు గోపీచంద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-భోగాపురం

వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని గూడెపువలస సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సచివాలయ పరిధిలోని దల్లిపేట పంచాయతీలో సర్పంచ్ దల్లి కాంత, మాజీ సర్పంచ్ దల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దల్లిపేట, ముగడపేట, గాలిపేట, రాళ్ళపాలెం, వెంపాడపేట గ్రామాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు.. ప్రభుత్వ పథకాలను గడపగడపకు వెళ్లి వివరించారు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని వారికి వివరించారు. ఈ సందర్భంగా తాగునీరు, కాలువలు, ఇళ్ల బిల్లుల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాలువల నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న సొంత స్థలాలను ఇస్తే నిధులు ఇచ్చే బాధ్యత తనదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దారు చింతా బంగార్రాజు, ఎంపిడిఒ అప్పలనాయుడు, నాయకులు పడాల శ్రీనివాసరావు, కొల్లి రామ్మూర్తి, సుందర హరీష్, శీరపు గురునాథ్, మైలపల్లి నర్సింహులు, అపరభుక్త పైడినాయుడు, గాలి రాజారెడ్డి, దల్లి బంగారురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యతనివ్వండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రామాల్లో అధికారులు కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయం, విద్యుత్తు, వైద్య ఆరోగ్య, ప్రజా రవాణా, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్, విద్య తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన ఎంపిడిఒ శేషుబాబు, కొట్టాం పిహెచ్‌సి వైద్యాధికారి జుత్తాడ హారిక, ఇఒపిఆర్‌డి లక్ష్మిని సన్మానించారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్‌ఎంపిపిలు ఇందుకూరి సుధారాజు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజు

సామూహిక సీమంతాలు

మండల కేంద్రంలోని ప్రయివేటు కళ్యాణ మండపంలో జగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతతో బాధపడకూడదని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ప్రభుత్వం గర్భిణులకు ప్రత్యేక కిట్లు పంపిణీ చేయడంతో వీటిలో ఉండే పోషకాహారం ద్వారా పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. సంస్థ అధ్యక్షులు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజును, సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, సంస్థ అధ్యక్షులు ఇందుకూరి సుధారాజు, గౌరవాధ్యక్షులు, కొత్తవలస జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సంతోషికుమారి, రాష్ట్ర హిందీ అకాడమీ డైరక్టర్ గుమ్మడి స్వాతిరత్నం, ఎల్.కోట వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, వేపాడ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

డేటా సైన్స్‌తో విప్లవాత్మక మార్పులు

విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

డెంకాడ : నేటి ఆధునిక డిజిటల్ ప్రపంచంలో డేటా సైన్స్ విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని బెంగళూరుకు చెందిన స్విగ్గీ కంపెనీ సీనియర్ సైంటిస్ట్ జి.విశ్వనాథ్ తెలిపారు. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ డిపార్ట్మెంట్‌లో డేటా సైన్స్ పై జరిగిన గెస్ట్ లెక్చర్‌లో ఆయన మాట్లాడారు. డేటా విస్తరణ ఎన్నో పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడిందని, సవాళ్లు, పరిష్కారాలకు అనేక అవకాశాలు కల్పించిందని తెలిపారు. అనంతరం ఆయన్ను హెచ్‌ఒడి ఎ.రామారావు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.హరిబాబు, ప్లేసెమెంట్స్ డీన్ జి.ప్రకాశ్‌బాబు, అధ్యాపకులు యుగంధర్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

'సీతం'లో వ్యక్తిత్వ వికాసంపై సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుబాయ్ నుంచి కార్పొరేట్ ట్రైనర్ కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటర్వ్యూ నైపుణ్యాలు, విద్యార్థులకు భవిష్యత్ అవకాశాలు, విదేశాల్లో విద్యా, ఉద్యోగ అవకాశాలు గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికలు తొలగించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

భోజరాజపురం వద్ద వేగావతి నదిలో ఉన్న మున్సిపల్ ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికలు తొలగించాలని మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. మున్సిపల్ పంపు హౌస్‌ను శుక్రవారం కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల్లో పూడికలు తొలగించాలని డిఇ రవికుమార్‌ను ఆదేశించారు. వేసవిలో తాగునీరు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. అనంతరం పట్టణంలో పైపులైన్ మరమ్మతులను పరిశీలించారు. పైపులైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.బాబు, గోవిందరావు, పి.ఉమ పాల్గొన్నారు.

8 బోర్లు మంజూరు

ప్రజాశక్తి భోగాపురం

భోగాపురం పంచాయతీలో మండల పరిషత్తు నిధుల నుంచి 8 బోర్లు మంజూరైనట్లు వైసిపి నాయకులు పడాల శ్రీనివాసరావు తెలిపారు. భోగాపురంలో ఎస్‌సి, బిసి కాలనీలు, సుందరపేటకు రెండు, కొయ్యపేట, సరివలస, పశువుల ఆసుపత్రి, బష్ షెల్టరు వద్ద బోర్లు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. రూ.8.80 లక్షలతో ఈ బోర్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు కొంత నీటి ఎద్దడి తగ్గుతుందని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం రూ.63.25 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు శుభారంభం చేశారు. విటి అగ్రహారంలో రహదారులు, కంటోన్మెంట్ అంబేద్కర్ కాలనీలో సామాజిక భవనం ప్రారంభోత్సవం చేయగా, సంజీవయ్య కాలనీలో రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. అయ్యన్నపేట, ఆర్‌టిసి కాలనీ ప్రాంతాలలో రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్చార్జి డాక్టర్ విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, 38వ డివిజన్ కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు సుంకరి నారాయణ స్వామి, బోనెల ధనలక్ష్మి, చందక శ్రీనివాసరావు, సైలాడ ఈశ్వరమ్మ,తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ది నీచమైన పాలన : గురాన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నీచమైన పాలన చేస్తున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తోందని మండిపడ్డారు. చంద్రబాబుపై రోజుకొక తప్పుడు కేసు పెడుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షనేతలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచక పాలన అంతమొందించే సమయం దగ్గర పడ్డిందన్నారు. రాజకీయ కక్షతో రగిలిపోతున్న సిఎం తీరు ఎలా వుందో రాష్ట్ర ప్రజలకు అర్థమైందని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో నేటికీ ఒక్క ఆధారం కూడా చూపించలేక పోయారన్నారు. మద్యంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పాడి గేదెల కొనుగోలులో 2887 కోట్ల రూపాయల మేర కుంభకోణం జరిగిందని సాక్ష్యాధారలతో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ ఆరోపణలు చేశారని,చిత్తశుద్ధి వుంటే ఈ స్కాంపై శ్వేత పత్రం విడుదల చేయాలని, సిబిఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

కేసులు బనాయించడమేనా అభివృద్ధి?

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

ప్రతిపక్ష నేతలపై కేసులు బనాయించడమేనా అభివృద్ధి ? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం వేపాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రీ వ్యవహరించని విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి తీరుందని ఆక్షేపించారు. ఆధారాలు లేకుండా తప్పుడు కేసులు బనాయించి మరలా ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్న దురాలోచన చేస్తున్నారని విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతమన్న తేడా లేకుండా అన్నిచోట్లా వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారని తెలిపారు. అరాచక పాలన సాగిస్తున్న సిఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

భూముల రీసర్వే వేగవంతం

ప్రజాశక్తి-భోగాపురం

భూముల రీసర్వేను వేగవంతం చేయాలని జిల్లా డిప్యూటీ సర్వేయర్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ సూర్య భగవాన్ సర్వేయర్లకు తెలిపారు. భోగాపురం గ్రామంలోని పడమర ఖండం రీసర్వే కొన్ని రోజుల నుంచి మూడు నుంచి నాలుగు సర్వే బృందాలతో జరుగుతుంది. శుక్రవారం రీసర్వేను ఆయన పరిశీలించారు. రీసర్వే ఏవిధంగా చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరైతుకు సంబంధించిన భూమిని సర్వే చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. పడమర ఖండంలో సర్వే చేస్తున్న నాలుగు బృందాల వద్దకు వెళ్ళి సర్వేను పరిశీలించారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, విఆర్‌ఒ రామునాయుడు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విజేతలకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-విజయనగరం

ఆటల పోటీల్లో విజేతలతో కలెక్టర్ నాగలక్ష్మి

న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పలు క్రీడల్లో పాల్గొని విజయాలు సాధించిన జిల్లాకు చెందిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అభినందించారు. ఈ క్రీడల్లో పాల్గొని జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రశంసించారు. అఖిల భారత ఉద్యోగుల క్రీడల్లో మన రాష్ట్ర ఖో-ఖో జట్టు ద్వితీయ స్థానం సాధించగా రజత పతకం సాధించింది. ఈ జట్టులో గంట్యాడ మండలం పెదవేమలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పిఇటిగా చేస్తున్న టి.ఎల్.పి. ప్రసన్నకుమార్ సభ్యునిగా పాల్గొన్నారు. కబడ్డీ విభాగంలో మన రాష్ట్ర జట్టు తృతీయ స్థానం సాధించగా ఈ జట్టులో డెంకాడ మండలం రఘుమండ పిఇటిగా చేస్తున్న కూర్మాన భాను వున్నారు. వీరిరువురూ గురువారం జిల్లా కలెక్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి తాము సాధించిన విజయాలను వివరించారు. జిల్లా కలెక్టర్ వారిని అభినందిస్తూ ఇతర ఉద్యోగులకు వారు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ బి.సహాదిత్ వెంకట్ త్రివినాగ్, డిఇఒ లింగేశ్వర రెడ్డి తదితరులు అభినందించారు.

శ్రీనివాసరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-విజయనగరం

శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఎపిఇడబ్ల్యూఐడిసిలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు సేవలు మరువలేనివని ఆ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు జివిఎన్ మూర్తి కొనియాడారు. అక్టోబర్ నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసరావుకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు సుదీర్ఘకాలం పాటు సేవలు అందిచడంతో అందరితో మంచి సంబందాలు కలిగి ఉన్నారని తెలిపారు. నిబద్ధతతో పని చేయడంతో అందరికి మంచి మిత్రుడుగా ఉన్నారని ఆయన చెప్పారు. అనంతరం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో డిఇలు, ఎఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ మెడలో గొలుసు చోరీ

పాఠశాలకు వెళ్తుండగా ఘటన

ప్రజాశక్తి - జామి

బడికి వెళ్తున్న సమయంలో ఓ ఉపాధ్యాయిని మెడలో బంగారు గొలుసును చోరీ చేసిన సంఘటన జామి మండలంలో కలకలం రేపింది. శుక్రవారం మండలంలోని లొట్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కె.అరుణ కుమారి విజయనగరంలో నివాసముంటున్నారు. రోజూ మాదిరిగా ఉదయం పాఠశాలకు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. అలమండ సంత సమీపంలోని సింగారం జంక్షన్ వద్ద వెనుక నుంచి బైక్‌పై మాస్కులు పెట్టుకొని వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో 2 తులాల బంగారు గొలుసును తెంపేసి, పరారయ్యారు. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన వారు అక్కడ నుంచి భీమసింగి వైపు వెళ్లినట్లు ఆమె తెలిపారు. నలుపురంగు పల్సర్ బైక్‌పై వచ్చారని, నంబర్ ప్లేట్ లేదని ఆమె వివరించారు. ఎస్‌ఐ వీరబాబు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

బాధిత హెచ్‌ఎం అరుణకుమారి